

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

03 జూన్ 2025 పేజీలు : 08 మంగళవారం


- ఉద్యోగుల మధ్య స్నేహపూరిత పోటీ
- పచ్చదనపు ప్రగతితో పరుగులు..
- అధునాత సౌకర్యాలతో నగరవనం అందాలు
- నిర్వాహణ పరంగా రూ.20 లక్షల రెవెన్యూ
- ముందంజలో నెల్లూరు.. రాపూరు తరువాత స్థానాల్లో ఆత్మకూరు, కావలి, ఉదయగిరి
- డీఎఫ్ఓ మహబూబ్ బాషా సారథ్యానికి సెల్యూట్




## అభివృద్ధి పథంలో.. అటవీ శాఖి

సహజసిద్ధమైన ప్రకృతి వనరులు. వృక్ష సంపద, వన్య ప్రాణుల సంరక్షణ, అటవీ విస్తీర్ణం, రిజర్వు భూముల పరిరక్షణతోపాటు కొన్ని అదృశ్య శక్తులు సాగిస్తున్న అసాంఘిక కార్యకలాపాలపై జిల్లా అటవీ అధికారి కదిరి మహబూబ్ బాషా అందిస్తున్న దిశ, నిర్దేశిత మార్గ దర్శకాలను శిరోధార్యంగా భావిస్తూ.. పటిష్ట నిఘా చర్యలతో అడ్డుకట్ట వేస్తూ ఉక్కుపాదం మోపడంలో సమర్థవంతమైన పనితీరును కనబరుస్తున్న అధికారులు, సిబ్బంది కృషి ఫలితంగా అటవీ శాఖ ప్రస్థానం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నట్లు తెలుస్తోంది.

నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :

ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాల సాధనలో భాగంగా ఉద్యోగుల మధ్య పరస్పరం సాగుతున్న స్నేహపూరిత పోటీతత్వం వాతావరణం వల్ల పచ్చదనపు ప్రగతితో పరుగులు పెడుతున్నట్లు తెలుస్తోంది. అటవీ అభివృద్ధి లక్ష్యాలను పురోగాభివృద్ధి బాటలో మరింత ముందుకు తీసుకెళ్లడంలో నెల్లూరు.. రాపూరు రేంజ్లు ముందంజలో ఉండగా, మిగిలిన స్థానాల్లో ఆత్మకూరు, కావలి, ఉదయగిరి రేంజ్లు కాస్త అటూ ఇటుగా వెనుకబడి ఉన్నట్లు సమాచారం. నెల్లూరు రేంజ్ పరిధిలో ఊపందుకుంటున్న పర్యవేక్షణ చర్యలు.. అభివృద్ధిని పరిశీలిస్తే, రాపూరు మండలంలోని మద్దెలమడుగు సెంటర్ నుంచి సైదాపురం, క్రిష్ణపట్నం పోర్టు, మైపాడు, వెంకటాచలం మండలంలోని కసుమూరు బీట్ వరకు 24,350 హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది. నెల్లూరు – పొదలకూరు మార్గంలోని ఆమంచర్ల బీట్ పరిధిలో 50 హెక్టార్ల విస్తీర్ణంలో రూ.3.50 కోట్ల వ్యయంతో అధునాతనంగా రూపుదిద్దుకున్న నగరవనం (మోడల్ పార్క్) నెల్లూరు రేంజ్ పరిధిలోనే ఉండటం విశేషం. సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటూ మంత్రముగ్ధుల్ని చేసి కట్టిపడేసే రీతిలో చిల్డ్రన్స్ పార్క్, వాకింగ్ ట్రాక్, ట్రెక్కింగ్‌పాత్, వ్యూపాయింట్, యోగా సెంటర్, క్యాపీరియా, మారేడు వనాలు, డ్రింకింగ్ వాటర్ ప్లాంట్స్ వంటి మౌళిక వసతులతో జిల్లాకే తలమానికంగా చెప్పుకునే నగర వనంలో లభించే ఆహ్లాదకర వాతావరణం మధ్య హాయిగా ఉపశమనం పొందేందుకు సుదూర ప్రాంతాల నుంచి సందర్శకులు వచ్చి వెళుతుంటారు. నగరవనం అందాలను వీక్షించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతుండటంతో నిర్వాహణ ఖర్చుల నిమిత్తం పెద్దలకు కేవలం రూ.20, పిల్లలకు రూ.10 స్వల్ప టికెట్లు నిర్ణయించారు. దీంతో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, -మిగతా 2లో


## కార్యకర్తల సంక్షేమానికి జనసేన పెద్దపీట

- జనసేన నిధికి సీనియర్ నేత నూనె మల్లికార్జున యాదవ్ రూ.లక్ష విరాళం
- నాయకులు బోనుబోయిన ప్రసాద్ యాదవ్, హరీష్, అనిల్ రామారావు ఒక్కొక్కరు రూ.లక్ష అందజేత
- ఎమ్మెల్సీ నాగబాబుకు సమక్షంలో చెక్కు అందజేత

2లో



## అభివృద్ధి.. సంక్షేమం చంద్రబాబుకే సాధ్యం



- కొడవలూరు మండలంలో వైసిపి భూస్థాపితం
- వేమిరెడ్డి దంపతుల సమక్షంలో 1500 మంది టీడీపీలో చేరిక
- వైసీపీలో మంచోళ్ళకు స్థానంలేదు
- చంద్రబాబు ప్రతి హామి అమలు చేస్తారు

వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు, మేజర్‌న్యూస్ : ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పేదల గడప దాకా చేర్చే బాధ్యత తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలదేనని వేమిరెడ్డి దంపతులు అన్నారు. బెల్లం వెంకయ్య నాయుడు ఆధ్వర్యంలో 1500కు పైగా వైసీపీ నాయకులు వేమిరెడ్డి దంపతుల సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొడవలూరు మండలం కమ్మపాళెం చేరుకున్న వేమిరెడ్డి దంపతులను తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అఖండ స్వాగతం పలికారు. వైసీపీ నాయకులు బెల్లం వెంకయ్య నాయుడు, గరిక మస్తానయ్య, పెమ్మారెడ్డిపాళెం ఎంపీటీసీ ఉరుటూరు శేషమ్మ, కమ్మపాళెం సర్పంచ్ చౌటూరు లక్ష్మయ్య,

02

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే.. ఉపేక్షించవద్దు

ఎస్పీల సమీక్షలో గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ట




నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి సూచించారు. సోమవారం మినీ కాన్ఫరెన్స్ హాలులో టౌన్, రూరల్ పోలీసు అధికారులతో గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి, జిల్లా ఎస్పీతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుత పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యలను ఆరా తీసి, పలు సూచనలు చేశారు. పాత నేరస్థులు, రౌడీ మూకలు, సస్పెక్ట్స్, కేడీలు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించవద్దన్నారు. వారికి తప్పక కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. బైండోవర్‌ను అతిక్రమిస్తే జరిమానా కట్టించడం లేదా ఆస్తులు జప్తులు చేయాలన్నారు. విజబుల్ పోలీసింగ్, డ్రోన్ సర్వైలెన్స్ విరివిగా చేయాలని ఆదేశించారు. కేసు దర్యాప్తులలో ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని కేసులను దర్యాప్తు చేయాలన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులు పట్ల అలసత్వం ప్రదర్శించరాదన్నారు. మిస్సింగ్ కేసులను ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వెంటనే ఛేధించాలని -మిగతా 2లో

# కార్యకర్తల సంక్షేమానికి జనసేన పెద్ద పీట

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేయడం జరిగిందని ఎమ్మెల్సీ నాగబాబు పేర్కొన్నారు. కార్యకర్తల ఇన్సూరెన్స్‌లో భాగంగా ఐదు కోట్ల నిధులను కేటాయించడం జరిగిందని చెప్పారు. సోమవారం మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా సీనియర్ నేత నూనె మల్లికార్జున యాదవ్ పార్టీ నిధికి రూ.లక్ష విరాళం ప్రకటించి, ఆ చెక్కును ఎమ్మెల్సీ నాగబాబుకి అందజేశారు. వారితో పాటు సర్వేపల్లి నియోజకవర్గ నాయకులు బోనుబోయిన ప్రసాద్‌యాదవ్, ఆత్మకూరు చెదలవాడ హరీష్, మృధుల, వేంకటగిరి నాయకులు అనిల్ రామారావు, తలో రూ.లక్ష చెక్‌ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ.. దేశంలో ఏ పార్టీలో లేనివిధంగా జనసేన పార్టీ కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. పార్టీ నిధికి తన వంతు సహాయంగా రూ.లక్ష ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ సూచన మేరకు.. ఆయన సమక్షంలో చెక్కును అందజేశానన్నారు. జిల్లాలో జనసేన అంచలంచెలుగా ఎదుగుతుందన్నారు. భవిష్యత్తులో మరింత బలపడనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ



సభ్యత్వం పొందిన వారికి ఇన్సూరెన్స్ పాలసీ ఇవ్వడమనేది డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆలోచన అంటూ అభినందించారు. పవన్‌కళ్యాణ్ పార్టీలో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆయన ఆశయ సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నూనె ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గునుకుల కిషోర్, కాకు మురళి రెడ్డి, పి చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి,రవి,ఆఫీస్ ఇంచార్జి జమీర్, గుర్రం కిషోర్, మహేష్ శర్మ, ప్రశాంత్ గౌడ్, రాజేష్, మనోహర్, నందిని, వీరమహిళలు పాల్గొన్నారు.

# అభివృద్ధి.. సంక్షేమం చంద్రబాబుకే సాధ్యం

*(మొదటి పేజీ తరువాయి)*


రెడ్డిపాళెంకు చెందిన వైసీపీ నాయకులు నీలకంఠం శ్రీధర్ రెడ్డి, కమ్మపాళెం ఎంపీటీసీ పీరం అరుణకుమారి, రామన్నపాలెం సర్పంచ్ కాకి శ్రీనివాసులు తదితర నాయకులకు వేమిరెడ్డి దంపతులు తెలుగుదేశం కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మంచోళ్ళు వైసీపీలో ఉండలేరన్నారు. దైవ నిర్ణయం మేరకే తాను తెలుగుదేశం పార్టీలో చేరానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఆయన అభివృద్ధికి మారు పేరుగా అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల సమర్థత చంద్రబాబు నాయుడుకే ఉందన్నారు. చంద్రబాబు నాయుడు సంక్షేమ పాలనకు ఆకర్షితులై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు టీడీపీ వైపు చూస్తున్నారన్నారు. పాత కొత్త నాయకుల మధ్య సమస్యలేమైనా ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులకు హితోపదేశం చేశారు. అనంతరం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబు సంక్షేమ విధానాలకు ఆకర్షితులై వైసీపీ వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరిన నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజలు ప్రభుత్వానికి మధ్య నాయకులు వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. తన పట్ల నమ్మకం





ఉంచి తనవెంట రాజకీయ ప్రయాణం చేస్తున్న నాయకులకు అండగా ఉంటానన్నారు. గతంలో కోవూరులో కేవలం నలుగురు మాత్రమే అధికారం చెలాయించారని, తన హయాంలో ప్రతి గ్రామ నాయకుడు నేరుగా అధికారుల వద్దకు వెళ్లి పనులు చేయించుకునే స్వేచ్ఛ ఉందన్నారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ ప్రజలతో మమేకమై పని చేసే నాయకులకు తాను అండగా ఉంటానన్నారు. తన ఎన్నికల నినాదమైన అవినీతి రహిత కోవూరు నినాదంలో నాయకులు భాగస్వాములు కావాలని కోరారు. సహజ వనరులు, ఇఫ్కో, మిధాని లాంటి పారిశ్రామిక సంస్థలున్న కొడవలూరు మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన బెల్లం వెంకయ్య మాట్లాడుతూ.. తాను ఎన్నికలలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సహకరించక తప్పు చేశానని తనను క్షమించాలని కోరారు. తన జీవితాంతం ప్రజలకు నిస్వార్థ సేవ చేస్తున్న వేమిరెడ్డి అడుగు జాడల్లో నడుస్తానన్నారు. టీడీపీలో చేరిన పలువురు నాయకులు మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు అభివృద్ధి విధానాలు, వేమిరెడ్డి దంపతుల నిస్వార్థ సేవా కార్యక్రమాలకు ఆకర్షితులమై టీడీపీలో చేరుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొడవలూరు మండల టీడీపీ అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, బుచ్చిరెడ్డిపాళెం అర్బన్, రూరల్ టీడీపీ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసరావు, బెజవాడ జగదీష్, విడవలూరు టీడీపీ మండల అధ్యక్షులు శ్రీహరిరెడ్డి, సీనియర్ నాయకులు శేఖర్‌రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, జొన్నవాడ ఆలయ మాజీ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, మోర్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

## చదువుల తల్లికి వీపీఆర్ ఫౌండేషన్ చేయూత



**అసలే నిరుపేద కుటుంబం. రోడ్డు ప్రమాదంలో తండ్రి చనిపోయాడు.చిన్న అంగడి పెట్టుకొని కాపురాన్ని నెట్టుకొస్తున్న తల్లికి కూతురి చదువు భారంగా మారిన పరిస్థితులలో విపిఆర్ ఫౌండేషన్ ఆపన్న హస్తం అందించి 50 వేల ఆర్థిక సహాయం అందించింది.**

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

నగర శివార్లలోని కనుపర్తిపాడు సమీపంలోని ఇందిరమ్మ కాలానికి చెందిన గాయత్రి వీపీఆర్ విద్యాసంస్థలో 10వ తరగతిలో 587 మార్కులు సాధించి తన ప్రతిభను చాటుకుంది. తండ్రి కృష్ణారావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పైచదువులు చదివించాలన్నా వేలకు వేలు ఫీజులు చెల్లించే ఆర్థిక స్తోమత తల్లి ఝాన్సీకి లేదు. 10వ తరగతి వరకు ఉచిత విద్య అందించిన వీపీఆర్ ఫౌండేషన్ ద్వారానే ఇంటర్మీడియట్ చదువుకు ఆర్థిక సహాయం ఆశించి తన కుమార్తెను చదివించలేని తన దయనీయ పరిస్థితిని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని కలిసి చెప్పుకుంది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హరనాథ్‌పురం నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకుంటానన్న విద్యార్థిని గాయత్రికి ఫీజు ఖర్చులకు గాను వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా 50 వేల చెక్కు అందించారు. 10 తరగతి వరకు ఉచితంగా చదివించిన వీపీఆర్ ఫౌండేషన్ పైచదువులకు కూడా ఆర్థిక సహాయం అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తన కుమార్తె చదువులకు 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి విద్యార్థిని గాయత్రి ఆమె తల్లి ఝాన్సీ కృతజ్ఞతలు తెలిపారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే.. ఉపేక్షించవద్దు

*(మొదటి పేజీ తరువాయి)*

ఆదేశించారు. కొత్త న్యాయ చట్టాల మీద ప్రతీ ఒక్కరు పరిపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. రాత్రి పూట అన్ని స్టేషన్లలలో గస్తీలు ముమ్మరం చేయాలనీ, అనుమానితుల వేలిముద్రలు సేకరించాలని సూచనలిచ్చారు. జిల్లాలలో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులను తెలుసుకొని, కేసు దర్యాప్తు ప్రారంభించడానికి ముందు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలన్నారు. కేసు వెనుక ఉన్న మూలాలను తెలుసుకోవాలన్నారు. అప్పుడు పురోగతి సాధించగలుగుతామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రమాదాలు ఎక్కువగా జరిగే సమయం, ప్రాంతాలను విశ్లేషించి, ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా అధికారులకు అమూల్యమైన సలహాలు, సూచనలు అందించిన ఐజీకి ఎస్పీ ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లాలో పెండింగ్ కేసులు తగ్గించుటకు తీసుకుంటున్న ప్రణాళికలు, ముందస్తు చర్యలు ఎస్పీ వివరించారు.

# అభివృద్ధి పథంలో.. అటవీ శాఖ

*(మొదటి పేజీ తరువాయి)*

పాఠశాలలు, సందర్శకుల తాకిడి పెరగడంతో గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ నాటికి నిర్వాహణ పరంగా రూ.20 లక్షల రెవెన్యూ వచ్చినట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. ఇదే క్రమంలో నెల్లూరు రేంజ్ పరిధిలో ఉన్న నగరవనం, సైదాపురం నర్సరీల నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ 2.66 లక్షల మొక్కల పెంపకం ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. దీంతో 1.5 మీటర్ల ఎత్తుతో మొక్కల పెంపకం ప్రక్రియను వేగవంతం చేస్తున్న అధికారులు ఈ ఏడాది అక్టోబరు నెలాఖరులో ప్రారంభమయ్యే వర్షాకాల సీజన్ నాటికి 200 ప్లాంటేషన్లలో నాటేందుకు అవసరమైన మొక్కలను సిద్ధం చేసేందుకు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

**రాపూరు రేంజ్ పరిధిలో..**

డిఎఫ్వో మహబూబ్ బాషా ఆదేశాల మేరకు అటవీశాఖ రాపూరు రేంజ్ ఆఫీసర్ పందిళ్ల రవీంద్రబాబు సారథ్యంలో అటవీ ప్రాంతాల్లో హాయిగా ఊపిరి పోసుకుంటున్న జీవవైవిధ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నారు. ఎర్రచందనం, మైనింగ్, వన్యప్రాణి ఆధారిత రేంజ్ కావడంతో క్షేత్రస్థాయిలో గాలింపులు, కూంబింగ్‌లు, నాకాబందీ తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. రాపూరు రేంజ్ పరిధిలోని చిట్వేల్ సరిహద్దు ప్రాంతమైన కూలమర్రిలో పులి సంచారాన్ని గుర్తించడం తెలిసిందే. దీనికి తోడు శేషాచల కొండల నుంచి రాపూరు వెలుగొండ అడవుల మీదుగా నల్లమల ఫారెస్ట్ వరకు దట్టమైన వృక్ష సంపదతోపాటు వనరులతో కూడిన ఆవాసయోగ్యకర వాతావరణం అందుబాటులో ఉండటం.. పులి జాతి ఎక్కువగా రాకపోకలు సాగిస్తుండటంతో పలు సందర్భాల్లో పశువుల కాపరులు, ఫలసాయం కోసం అడవుల్లో తిరిగే గిరిజనులు గుర్తించి అటవీ అధికారులకు సమాచారం అందించడంతో సమగ్ర సర్వే ద్వారా వాస్తవాలను గుర్తించిన అటవీ ఉన్నతాధికార యంత్రాంగం సిఫారసు మేరకు ఉమ్మడి జిల్లాల్లోని తిరుపతి శేషాచలం రిజర్వు ఫారెస్ట్ నుంచి రాపూరు, ఆత్మకూరు రేంజ్లను కలుపుతూ ఉదయగిరి రేంజ్ పరిధిలోని సీతారామపురం అడవుల వరకు టైగర్ కారిడార్‌గా నిర్ధారించడం జరిగింది. రాపూరు రేంజ్ పరిధిలోని ఎర్రచందనం అక్రమ రవాణా, అడవి జంతువుల వేట, ఇతర అసాంఘిక కార్యకలాపాలను గుర్తించి చర్యలు తీసుకునేందుకు వీలుగా 80 నిఘా నేత్రాలు (సీసీ కెమెరాలు), ఇదే క్రమంలో వేసవి ఎండల నేపథ్యంలో అమాయక వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు 220 సాసర్పిట్స్ (నీటితొట్టెలు) ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి రోజు క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నారు. ఇదే క్రమంలో ఎక్కడ కూడా సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలతో సిబ్బందిని అప్రమత్తం చేయడంలోనూ, ప్రభుత్వ ఆదేశానుసారం రెవెన్యూ శాఖ చేపడుతున్న సమగ్ర భూసర్వే ప్రక్రియలో అధికారులు, సిబ్బంది భాగస్వాములు కావడం సత్ఫలితాలను ఇచ్చిందని చెప్పవచ్చు. అటవీ రిజర్వు భూములు ఆక్రమణకు గురైనట్లు గుర్తించిన వెంటనే సదరు భూములను స్వాధీనం చేసుకోవడం, ప్రకృతి ప్రసాదించిన ఎర్రచందనం, మైనింగ్ జోలికొస్తే ఉపేక్షించబోమని, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేయడం వంటి చర్యలతో అక్రమార్కులకు దడపుట్టిస్తున్నారు. మైనింగ్ మాఫియా, వేటగాళ్లు, ఎర్రచందనం స్మగ్లర్ల ఎత్తుగడలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ లక్షలాది రూపాయల విలువ చేసే దుంగలు, వాహనాలతోపాటు నిందితులను అదుపులోకి తీసుకోవడంలో విశేష కృషి చేస్తున్న రేంజ్, డిప్యూటీ రేంజ్ స్థాయి అధికారులతోపాటు సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసరు, స్ట్రైకింగ్ ఫోర్స్, ఫైర్, ప్రొటెక్షన్ వాచర్లకు పేరు పేరునా ప్రజలు అభినందనలు తెలుపుతుండటం గమనార్హం. ఇదే తరహా ఉత్సాహంతో అరుదైన ఎర్రచందనాన్ని అక్రమార్కుల బారి నుంచి కాపాడుకోవడంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆశిద్దాం.

# ప్రతి గర్భిణీ స్త్రీ వివరాలను తప్పకుండా నమోదు చేయాలి

## డీఎం అండ్ హెచ్ఓ సుజాత వెల్లడి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ప్రతి గర్భిణీ స్త్రీ వివరాలను తప్పకుండా చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి వి.సుజాత వెల్లడించారు. సోమవారం జిల్లా వైద్య రోగ్యశాఖ కార్యాలయంలో మాత శిశు మరణాల సబ్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో 2025 ఏప్రిల్, మే నెలలలో సంభవించిన రెండు మాతృ మరణాలు, 6 శిశు మరణాలకు గల కారణాలు, లోపాలు గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ప్రతి గర్భిణీ స్త్రీని గుర్తించి త్వరిత గతిన నమోదు చేయాలని, అన్నీ రకాల పరీక్షలు తప్పని సరిగా చేయాలని, హైరిస్క్ గర్భిణీ స్త్రీలను గుర్తించి, గర్భిణీ స్త్రీలకు ఎటువంటి ఆటంకం లేకుండా సంపూర్ణ ఆరోగ్య రక్షణ కల్పించి ప్రభుత్వ ఆసుపత్రిలో సుఖ ప్రసవం జరిగే వరకు సంబంధిత ఆరోగ్య పర్యవేక్షకురాలుకు పూర్తి భాద్యత అప్పగించాలని కోరారు. పిల్లలకు తప్పని సరిగా తల్లిపాలు ఇచ్చేలాగా, పుట్టిన పిల్లలందరికి '0' డోసులు 24 గంటలలో ఇవ్వాలని, ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికి వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని, పిల్లలకు రక్తహీనత లేకుండా ఐరన్ సిరప్ మాత్రలు తప్పని సరిగా ఇచ్చేలాగా పర్యవేక్షించాల్సిందిగా వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పులు జరిగేలాగా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని, అర్హులైన ప్రతి గర్భిణీ స్త్రీకి, బాలింతకు జెఎస్‌వై, జెఎస్ఎస్‌కె పథకాలు క్రింద లబ్ది చేకూరేలాగా చూడాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. ఏ తల్లి, బిడ్డ కూడా రక్తహీనత వలన, సకాలంలో వైద్య సేవలు అందక మరణించినట్లు తమ దృష్టికి వస్తే సంబంధిత వైద్య ఆరోగ్య సిబ్బంది పైన శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్య నిపుణుల కమిటీ సభ్యులు జిల్లాలో మాత శిశు మరణాలు నివారించుటకు ప్రతి గర్భిణీ స్త్రీకి 2డి ఎకో, టిఫా స్కాన్ చేయించాలని, అలాగే మధ్యస్థ రక్తహీనత నివారించుటకు ఐరన్ మాత్రలు రోజుకు 2, 3 అధిక రక్తహీనత నివారించుటకు ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్ లేదా ఫెర్రస్ కర్బాక్సీ మాల్టోజ్ ఇంజెక్షన్ ఇవ్వాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీసీహెచ్ ఎస్.పరిమళ, డీఎల్ఏటీ ఓ.షేక్ ఖాదర్ వలి, గైనిక్ ప్రొఫెసర్ ఐ.ఇందిర, అసోసియేట్ ప్రొఫెసర్లు వి.మేరిస్నిగ్ధ, శోభారాణి, విజయలక్ష్మి, సింధూజ, ఎం.హేమంత్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎన్.జాక్‌వాసవి, విజయకుమారి, డిఐఓఏ ఉమామహేశ్వరి, డిప్యూటీ డిఎం హెచ్ఓలు పి.బ్రిజిత, ఎస్.రజని, డెమో కె.కనకరత్నం, డిపిహెచ్ఎన్ఓ జి.మంజుల, ఎఎస్ఓ రమేశ్, సంబంధిత వైద్యాధికారులు ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశించిన సమయంలోపు పరిష్కారాలు అందించండి

## కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్న ఫిర్యాదులకు నిర్దేశించిన సమయంలోపు పరిష్కారాలను అందించాలని కమిషనర్ వై.ఓ నందన్ అన్ని విభాగాల అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ నందన్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లనుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందుకున్న స్థానిక సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. టిడ్కో గృహాల లబ్ధిదారులకు వివిధ కారణాలతో బ్యాంకుల నుంచి రుణాలు అందలేదని, వారు చెల్లించిన మొత్తాలను తిరిగి చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వారికి మంజూరు చేసిన గృహాలను అర్హులైన ఇతరులకు మంజూరు చేయనున్నామని కమిషనర్ తెలిపారు. అదేవిధంగా ఇంకా పూర్తికాని నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు కేటాయించనున్నామని తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి రోడ్డు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల గురించి, మార్టగేజ్ విడుదల గురించి అర్జీలు అందుకున్నామని తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంభందించి రోడ్లు, డ్రైను కాలువల నిర్మాణం, సివిల్ వర్కులు, వీధి దీపాల ఏర్పాటు తదితర సమస్యలను అందుకున్నామని తెలిపారు. రెవెన్యూ విభాగం నుంచి అసెస్మెంట్ మార్పులు, నూతన ఇంటిపన్ను దరఖాస్తులు, ఇంటి పన్నులో మార్పులు తదితర అంశాలపై ఫిర్యాదులను అందుకున్నామని తెలిపారు. నగరవ్యాప్తంగా అన్ని డివిజన్లలో డ్రైన్ కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని, ప్రజలందరూ సహకరించాలని కమిషనర్ కోరారు. వర్షాకాలానికి సంబంధించి అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని, వర్షపు నీరు డ్రైన్ కాలువల ద్వారా సాఫీగా ప్రవహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని కమిషనర్ స్పష్టం చేశారు. విభాగాల వారీగా ఇంజనీరింగ్ 5, హౌసింగ్ 28, టౌన్ ప్లానింగ్ 5, రెవెన్యూ 6, పబ్లిక్ హెల్త్ 3, ఆప్కాస్ 2, అకౌంట్ సెక్షన్ 3, మొత్తం 52 ఫిర్యాదులను అందుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్ మోహన్ రావు, ఆరోగ్య శాఖధికారి డాక్టర్ చైతన్య, సిటీ ప్లానర్ హిమబిందు, సెక్రటరీ శ్రీలక్ష్మి, మేనేజర్ రాజేశ్వరి, ఇతర అన్ని విభాగాల అధికారులు, సూపరెంటెండెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంక్రీట్ పనుల పరిశీలన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవన పునఃనిర్మాణ పనులను సోమవారం పంచాయతీరాజ్ డీఈఈ సీహెచ్ మణికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.27 లక్షల పంచాయతీరాజ్ నిధులతో భవన పునఃనిర్మాణ పనులు చేపడుతున్నారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న బెడ్ కాంక్రీట్ పనులను పరిశీలించడం జరిగిందన్నారు. కాంక్రీట్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతోపాటు సకాలంలో క్యూరింగ్ పనులు చేసేలా సిబ్బందికి సూచించామన్నారు. వీలైనంత త్వరగా భవన నిర్మాణం పూర్తి చేసి అంద బాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు చింతనబోయిన శివకృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యోగాంధ్ర మండలస్థాయి పోటీలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండల స్థాయి యోగాంధ్రా పోటీలు మూడవ తేదీ నుండి 5వ తేదీ వరకు నిర్వహించబడతాయని ఎంపీడీవో కే.శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రామ సచివాలయ పరిధిలో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలను సాధించిన వారు ఈ పోటీలలో పాల్గొనాలని తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ పోటీలో మూడవ తేదీ పది నుండి 18 సంవత్సరాల లోపు నాలుగవ తేదీ 19 నుండి 35 సంవత్సరాల లోపు 5వ తేదీ 35 సంవత్సరాల పైబడిన వారికి ఈ పోటీలు నిర్వహింపబడతాయని తెలిపారు. మండల స్థాయి యోగానంద పోటీలు యోగా పెయింటింగ్ యోగ ఫోటోగ్రఫీ యోగా స్లోగన్ యోగా క్విజ్ యోగా షార్ట్ ఫిలిం యోగా సాంగ్ గ్రూప్ యోగా ప్రాణాయామం ధ్యానం సూర్య నమస్కారాలు తదితర అంశాలపై ఈ పోటీలు ఉంటాయని తెలిపారు. కావున సచివాలయ పరిధిలో విజేతలైన వారు ఈ పోటీలలో పాల్గొని మండల స్థాయిలో విజయం పొందాలని తెలిపారు.

# పొలం వద్ద ఘర్షణ.. మహిళకు తీవ్ర గాయాలు



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** పొలం వద్ద జరిగిన ఘర్షణలో ఓ మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం చోటు చేసుకొంది. బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా వున్నాయి.. తోటపల్లిగూడూరు మండలం నరుకూరు దళితవాడకు చెందిన ముష్టిగుంట నాగమణి అనే మహిళపై ఆదే గ్రామానికి చెందిన సాదేపల్లి సునీత అనే మహిళ దాడి చేసింది. ఈ దాడిలో నాగమణికి తల పగిలి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన నాగమణిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాగమణితో కలసి మరో 9 మంది మహిళలు, కొందరు పురుషులు సాదేపల్లి వేణు అనే రైతు పొలంలో కూలి పనులకు వెళ్ళారు. పొలం వద్ద సాదేపల్లి గోపి, వేణులకు మధ్య వివాదం జరిగింది. ఈ వివాదం కాస్త ఘర్షణకు దారితీసింది. ఈ నేపథ్యంలో అడ్డుకోబోయిన నాగమణిపై సాదేపల్లి సునీత, ఆమె తమ్ముడు సూరి ప్రసాద్, సాదేపల్లి గోపి దాడి చేశారు. దాంతో తలపగిలి తీవ్రంగా గాయపడిన ముష్టిగుంట నాగమణిని హుటాహుటిన నెల్లూరు పెద్దాసుపత్రికి తరలించారు. నాగమణి తలపై ఎనిమిది కుట్లు పడినట్లు వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. ప్రస్తుతం నాగమణి ఆరోగ్యం విషమంగా వుందని తెలిసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# నవోదయ తరగతులు ప్రారంభం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని శ్రీ సుబ్రహ్మణ్య నవోదయ అండ్ సైనిక స్కూల్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం నవోదయ, సైనిక స్కూలుకు సంబంధించి తరగతులను ప్రారంభించారు. అకాడమీ డైరెక్టర్ బిఎస్ రాజు ముందుగా అర్చకులు ఫణి శర్మ ఆధ్వర్యంలో దైవపూజ కార్యక్రమం జరిపించారు. దైవపూజ అనంతరం ఉపాధ్యాయులచే తరగతుల ప్రారంభ కార్యక్రమాన్ని జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వింజమూరులో మొట్టమొదటిగా నవోదయ సైనిక స్కూల్ అకాడమీ స్థాపించి ఎన్నడూ లేని విధంగా ఫలితాలను సాధించామని తెలిపారు. మొట్టమొదటి ప్రయత్నంలోనే నవోదయలో ఆరుగురు విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశం పొందారని ఇది మాకు ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయని ఆసక్తి కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించి వారికి బంగారు బాట వేయవలసిందిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టి.రవి అకాడమీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలి

- ఊసేలేని సూపర్ సిక్స్ హామీలు
- వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాపకన్ను మధుసూదన్ రెడ్డి



**రాపూరు, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారిని మోసం చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 4వ తేదీన రాపూరులో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్సీపి జిల్లా ప్రధాన కార్యదర్శి పాపకన్ను మధుసూదన్ రెడ్డి కోరారు. రాపూరు పట్టణంలోని బాలాజీ కళ్యాణ మండపంలో వెన్నుపోటు దినం పోస్టర్లను వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాపకన్ను మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. 2018 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 90శాతానికిపైగా అములు చేశారని తెలిపారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను కొనసాగించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా రెడ్ బుక్ రాజ్యాంగంతో ప్రతి పక్ష పార్టీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజలను భయ పెట్టేందుకు యత్నిస్తోండన్నారు. వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఎన్నికల హామీలను అమలు చేయని కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు వెంకటగిరి నియోజ కవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు రాపూరులోని సిద్దలయ్య గుడి సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు బొడ్డు మధుసూదన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బత్తిన పట్టాభి రామిరెడ్డి, డాక్టర్ ఖాదర బాషా, కొటేశ్వర్ రెడ్డి, మురళీ రెడ్డి, గణేష్‌రెడ్డి, సంజీవ్ రెడ్డి, పిచ్చిరెడ్డి, శివయ్య, గౌస్ పీర్, డీ.రమణయ్య, వరబాబు వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి సంక్షేమాలే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరి చెంచలబాబుయాదవ్



**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** గత వైసీపి ప్రభుత్వ హయాంలో అనుసరించిన నిర్లక్ష్యం, భాద్యతారాహిత్యపు విధివిధానాల వల్ల కుప్పకూలిన రాష్ట్రాభివృద్ధి. ప్రజాసంక్షేమాన్ని తిరిగి పురోగభివృద్ధి దిశగా గాడిలో పెట్టడమే లక్ష్యంగా ఎంచుకొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తుందని మాజీ జడ్పీ చైర్మన్ టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మైపాడుగేటు ప్రాంతంలో ఉన్న తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చక్కటి పరిపాలన దక్షత కలిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగేలా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రధానంగా గత వైసీపి ప్రభుత్వ నిర్వాకంతో నిర్వీర్యమైన గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం ప్రత్యేక యాక్షన్పన్తో ముందుకు సాగుతుంద న్నారు. గత వైసీపీ హయాంలో అడుగడుగునా గంతలతో అధ్వాన్నంగా తయారైన పల్లె రహదారులతో ప్రజలు ఎదుర్కొన్న అవస్థలు వర్ణనాతీతమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మొదటి ప్రాదాన్యత కల్పించడంతో అధునాతన నిర్మాణాలతో రోడ్లకు.. పునరుద్ధరణ పనులతో చెరువులకు మహర్దశ పట్టిందన్నారు.గత వైసీపి హయాంలో ప్రాణాలను అరచేతుల్లో పట్టుకొని గతుకుల రోడ్లపై భయందోళనల మద్య ప్రయాణించిన ప్రజలు.. ప్రస్తుతం రోడ్ల ఆధునీకరణతో రూపురేఖలు మారిపోవడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా హాయిగా రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు.వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ప్రతినెల 1వ తేదీనే ఠంచన్గా పింఛన్లు, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి సర్కార్ మాత్రమే కావడం గర్వకారణమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రజాప్రయోజనాల కోసం అహర్నిశలూ పరితపిస్తున్న కూటమి ప్రభుత్వ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సాధిస్తున్న పురోగభివృద్ధిని పరిగణలోకి తీసుకున్నట్లయితే 2029 ఎన్నికల్లో కూటిమి ప్రభుత్వం గెలుపు ఏకపక్షమేనన్న సంకేతాలు ప్రజల నుంచి వస్తుండటం శభపరిణామమన్నారు.

# కాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న బండగానిపల్లి సచివాలయం దుస్థితి




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** నిత్యం గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన సచివాలయ ఉద్యోగులు వచ్చామా.. వేలిముద్ర వేశమా వెళ్లిపోయామా అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. సమావేశాల పేరుతో కొందరు. క్షేత్రస్థాయిలో ఉన్నామని మరికొందరు చెబుతూ యథేచ్ఛగా విధులకు డుమ్మా కొడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన అధికార లపై వివాదాలకు దిగుతున్నారు. ఇదీ ఉదయగిరి మండలంలోని బండగానిపల్లి సచివాలయ ఉద్యోగుల పరిస్థితి. సోమవారం సచివాలయంలో పది మంది ఉద్యోగులకుగాను ఇద్దరు మాత్రమే అందుబాటులో ఉండడంతో పని నిమిత్తం వచ్చిన ప్రజలు అగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇటీవల నూతన రేషన్కదార్డులకు మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో ప్రజలకు సచివాలయాలకు క్యూ కడుతున్నారు. అయితే ఆ సచివాలయంలో సిబ్బంది ఎవరూ అందుబాటులో ఉండడంలేదని ఉదయం ఏదో ఒక సమయానికి సచివాలయానికి వచ్చి వేలిముద్ర వేసి కొంతసేపు కాలక్షేపం చేసి వెళ్లిపోతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై పలువురు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారిని సైతం బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా తమ పందాను కొనసాగిస్తున్నారు. సచివాలయాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో అప్పాజీని వివరణ కోరగా విచారించి చర్యలు చేపడతామని తెలిపారు.

## మరమ్మత్తులకు నోచుకోని చేతిపంపు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండలంలోని మర్లపూడి పంచాయతీ పరిధి లో చీకవోలు క్రాస్ రోడ్డు సమీపాన ప్రయాణికులకు నిర్దేశించిన బోరు ఎప్పటినుంచో పనిచేయకపోవడం వాటిని అధికారులు గుర్తించకపోవడం గమ్నార్థమని ప్రజలు వాపోతున్నారు అయితే పల్లెల దాహం తీర్చడంలో చేతిపంపుల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుంది. అయితే అధికారులు ఆ బోర్లను పట్టించుకోకపోవడం వలన మంచినీటి పథకాలు పడకేసినప్పుడు అవి ఆధారపడతాయి. అలాంటి బోర్లు చెడిపోయినప్పుడు మరమ్మతులపై అధికారులు దృష్టి సారించక పోవటవలన నిరుపయోగంగా మారుతు న్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు దృష్టి పెట్టి చేతిపంపు బోర్లపై దృష్టి సాధించగలరని ప్రజలు తమ ఆవేదన వ్యక్తపరిచారు.

## పంపిణీకి సిద్ధంగా ఉన్న పాఠ్య పుస్తకాలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఎంఈఓ మధు సూదన్‌రెడ్డి తెలిపారు. వింజమూరు మండలానికి 29810 పాఠ్యపుస్త కాలు ఎంఆర్సి పాయింట్‌కి వచ్చాయని ఈ పుస్తకాలను పాఠశాలల వారీగా పంపిణీ చేసేందుకు సిద్ధపరుస్తున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాలలో ప్రారంభం అయ్యేనాటికీ స్థాయిలో పుస్తకాలు అందజేస్తామని విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యము లేకుండా చూస్తామన్నారు. సిబ్బంది కొరత వల్ల ఏర్పాట్లు కొంత ఆలస్యమైనట్లు ఆయన తెలిపారు.

## ఎస్ఎస్ఎల్సీ ఎస్టీ డివిజన్-2 ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా జి.రామచంద్రమూర్తి



**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** తెలుగు గంగ వలయం ఆధీనంలోని ఎస్ఎస్ఎల్సీ, ఎస్సీ డివిజన్-2 ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు జి.రామచంద్ర మూర్తికి అదనపు భాద్యతలు అప్ప గిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందా యి. ఈమేరకు ఆయన భాద్యతలు స్వీక రించారు. ఇక్కడ రెగ్యులర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా విధులు నిర్వర్తిస్తున్న పి.విజయకుమార్రెడ్డి గతనెల 31న పదవీ విరమణ చేయడంతో.. పాలనాపరమైన సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకున్న తెలుగుగంగ ఉన్నతాధికారులు ఎస్ఎస్ఎల్సీ, ఎస్సీ డివిజన్-1 ఎగ్జి క్యూటివ్ ఇంజనీరుగా పనిచేస్తున్న జి.రామచంద్రమూర్తికి ఎస్ఎస్ఎల్సీ ఎస్సీ డివిజన్-2 ఇన్‌చార్జ్ ఎగ్జి క్యూటివ్ ఇంజనీరుగా అదనపు భాద్యతలు అప్పగించారు. ప్రస్తుతం సాధారణ బదిలీల ప్రక్రియ జరుగుతున్నందున మరో వారం రోజుల్లో ఎస్ఎస్ఎల్సీ, ఎస్సీ డివిజన్-2కు రెగ్యులర్ ఎగ్జి క్యూటివ్ ఇంజనీరు నియామకం జరిగే అవకాశం ఉన్నట్లు తెలుగుగంగ సర్కిల్ సూపరిండెంటింగ్ ఇంజనీరు నర్ల రాధాకృష్ణారెడ్డి తెలిపారు.

## ప్రధానోపాధ్యాయుడి బాధ్యతల స్వీకరణ

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గండిపాళెం గుంటుపల్లి కొండయ్యచౌదరి-సుబ్బమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఆర్.రవీంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కావలి మండలం రుద్రకోట ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆయనకు ప్రభుత్వం ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి కల్పిస్తూ గండిపాళెంకు బదిలీ చేయడంతోఆయన బాధ్యతలు స్వీకరించారు.

# వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి





## రాజ్యసభ సభ్యుడు మేడ రఘునాథ్ రెడ్డి పిలుపు

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల నాలుగో తేదీన చేపట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజ్యసభ సభ్యుడు రఘునాథ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సర్వేపల్లి నియోజకవర్గ నాయకుల సమన్వయ సమావేశంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4వ తేదీ నియోజకవర్గాల్లో చేపట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని పార్టీ నాయకులు కార్యకర్తలు సమన్వయంతో విజయవంతంగా చేయాలని సూచించారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి అక్రమ అరెస్టును.. మేడ రఘునాథ్ రెడ్డి ఖండించారు. కూటమి ప్రభుత్వ దుర్మార్గపు పాలనకు తగిన బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4వ తేదీ అన్ని నియోజకవర్గాల్లో వెన్నుపోటు దినంలి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వ అరాచక పాలనను ప్రజల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. సూపర్ సిక్స్ హామీల అమలు విషయంలో తెలుగుదేశం పార్టీ డైవర్షన్ పాలిటిక్స్. చేస్తుందన్నారు. అందులో భాగంగానే కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసు బనాయించి.. జైలుకు పంపారని మండిపడ్డారు. ఈ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను ప్రజలు చీకొడుతున్నారని అన్నారు. టీడీపీ ఇచ్చిన అబద్ధపు హామీలతో మోసపోయిన ప్రజలు. ఈరోజు తెలుగుదేశం పార్టీ నేతలు రోడ్ల మీదకు వస్తే చొక్కా పట్టుకుని నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చికెన్‌వ్యర్థాల అక్రమరవాణాను అరికట్టాలి

▸ జనసేన ఇన్‌చార్జ్ శ్రీధర్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** చికెన్‌వ్యర్థాల అక్రమరవాణాలను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్ కోరారు. సోమవారం ఆయన స్థానిక ఆర్డీవో భూమిరెడ్డి పావనికి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గ వ్యాప్తంగా చేపలచెరువులు ఏర్పాటుచేసి చేపలను పెంచుతున్నారన్నారు. చేపలమేతకొరకు కర్నాటక, తమిళనాడు నుండి చికెన్‌వ్యర్థాలు అక్రమ రవాణా నిత్యకృత్యంగా యధేచ్ఛగా సాగుతుందన్నారు. ఈ చెరువుల్లో పెంచే రూప్‌చంద్, ఫంగస్ చేపలు చికెన్‌వ్యర్థాలు తిని తట్టుకోగల శక్తి కలవని ఆయన పేర్కొన్నారు. ఈ చేపలు తినే ప్రజల ఆరోగ్యానికి ఎంతో హానికరమని శ్రీధర్ తెలిపారు. 2016లో వచ్చిన జివో నెంబర్56ప్రకారం చేపలమేతకు చికెన్‌వ్యర్థాలను వాడడం నిషేదించారని, అయినా చికెన్‌వ్యర్థాల రవాణా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. దీనివలన క్యాన్సర్, లివర్‌సంబంధ వ్యాధులు సోకే ప్రమాదం మెండుగా ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని పణంగాపెట్టి నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న చికెన్‌వ్యర్థాల అక్రమరవాణా మాఫియాను అరికట్టాలిని శ్రీధర్ ఆర్డీవో పావనికి విజ్ఞప్తిచేశారు. ఈ చికెన్‌వ్యర్థాల వినియోగం అత్యంత ఆందోళనకరంగా ఉందని ఆయన అన్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశం కాబట్టి సత్వరచర్యలు తీసుకోవాలని శ్రీధర్ కోరారు. ఈకార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు నీటిలో పడి వ్యక్తి మృతి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం మహిమలూరుకు చెందిన కంచర్ల వెంకటేశ్వర్లు(50) ప్రమాదవశాత్తు నీటిలోపడి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. వెంకటేశ్వర్లు ప్రతిరోజూ తమకు చెందిన గేదెలను మేపుకునేందుకు గ్రామశివార్లకు, బొగ్గేరు గట్టుకు వెళుతుంటాడు. గత 31వ తేదీన వెంకటేశ్వర్లు యధావిధిగా తమ గేదెలను తోలుకొని వెళ్ళగా సాయంత్రం గేదెలు మాత్రం ఇంటికిరాగా వెంకటేశ్వర్లు రాలేదు. దాంతో కుటుంబసభ్యులు గాలించసాగారు. ఆదివారం బొగ్గేరు సమీపంలో చూడగా అక్కడ నీటిలోపడి మృతిచెందిఉండగా మృతదేహాన్ని బంధువులు వెలికితీసి ఇంటికి చేర్చుకున్నారు. గేదెలను మేపుకునే సమయంలో వెంకటేశ్వర్లు ప్రమాదవశాత్తు ఆనీటిలోని బొందలో పడి ఊపిరాడక మృతిచెందాడని మృతుడి సోదరుడు చినవెంగయ్య ఈమేరకు ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుడు వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఆయన మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

# ఆత్మకూరులో 66కోట్ల బృహత్తర తాగునీటిపధకం

● అందరికీ అందడం గగనం ● సీరియస్ అయిన మంత్రి ఆనం





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో ఒక బృహత్తర తాగునీటిపథకం అత్యధికంగా నిధులు వెచ్చించి 2013లో శంఖుస్థాపన గావించి 2018లో ప్రారంభించగా ఈనాటికీ పట్టణంలో అందరికీ ప్రతిరోజూ నీరిచ్చే పరిస్థితి లేకపోవడంతో ఇటవల అధికారులతో సమీక్ష జరిపిన రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి సీరియస్ అయ్యారు. కొళాయినద్వారా సక్రమంగా తాగునీరందడంలేదని, తరచూ రంగు మారిన నీరు వస్తున్నాయని కౌన్సిలర్ గౌస్‌బాషా మంత్రి దృష్టికి తేగా ఆయన సంబంధిత ఏయిని అడుగగా తరచూ విద్యుత్‌సరఫరాకు అంతరాయం అని పేర్కొన్నారు. విద్యుత్ డియిని మంత్రి ప్రశ్నించగా ఏదేని మరమ్మత్తుల సమయంలో కొద్దిసమయం మాత్రమే సరఫరాకు అంతరాయం అని వివరించారు. దాంతో మంత్రి మాట్లాడుతూ వెంటనే ఇరువు సమన్వయంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, ప్రజలకు ప్రతిరోజూ నీరందించాలని ఆదేవించారు. పట్టణంలో తాగునీటికి అదనంగా 9కోట్ల రూపాయలు మంజూరు చేయించనున్నామన్నారు. ఆత్మకూరులో జనాభా అధికంగా ఉంటూ ఐదురోజులకొకదపా తాగునీరు పొందే పరిస్థితి ఉండగా 2012లో అప్పటి ఆత్మకూరు శాసనసభ్యులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ& ఆర్థికశాఖామాత్యులుగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి పరిస్థితిని గమనించి ఆత్మకూరుకు 40కిలోమీటర్లలో ఉన్న పెన్నానదిపైన ఉండే సోమశిల ప్రాజెక్టు నుండి ఆత్మకూరుకు తాగునీటిని అందించే బృహత్తర తాగునీటి పథకాన్ని (వాటర్‌ట్రీట్‌మెంట్‌ప్లాంట్) 66కోట్ల రూపాయలతో మంజూరు చేయించి 2013లో శంఖుస్థానగావించగా నిర్మాణం పూర్తయ్యాక 2018లో మున్సిపల్‌శాఖామంత్రి పొంగూరు నారాయణ ప్రారంభించారు. ఆత్మకూరులో పెద్ద వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. సోమశిల ప్రాజెక్టు ఉత్తరకాలువనుండి పెద్దపైపులు ఏర్పాటు ద్వారా ఈప్లాంటుకు నీరుచేరేలా, ఇక్కడ నీటిని శుద్ధిచేసి ఈపధకంలో నిర్మించిన 10ఓవర్ హెడ్‌ట్యాంకులను నీటిని అందిస్తే అక్కడనుండి కొళాయిలద్వారా ప్రజలకు సరఫరాచేసలా నిర్ణయించారు. రోజుకు 50లక్షల లీటర్ల నీరు ఆత్మకూరు ప్లాంటుకు చేరుతుండగా అక్కడ ఆలం, క్లోరిన్, ఫిల్టర్‌బెడ్‌లతో శుద్ధిచేసి నీటిని ప్రజలకు సరఫరా చేస్తుండేవారు. ప్లాంటులో కెమికల్స్‌తో శుద్ధిచేయడం, పంపింగ్ ద్వారా ఓవర్‌హెడ్‌ట్యాంకులకు పంపడం జరుగుతుంది. ఆత్మకూరు పట్టణ ప్రజలకు తాగునీరందించాలన్న సంకల్పంతో ఆనం రామనారాయణరెడ్డి పెద్దఎత్తున నిధులతో పథకాన్ని మంజూరు చేయించి శరవేగంగా నిర్మాణాలు పూర్తిచేయించగా పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వలన ప్రజలకు రెండురోజులకు ఒకరోజు మాత్రమే తాగునీటిని సరఫరాచేసి చేతులు దులుపుకుంటుండేవారు. ఆత్మకూరు మున్సిపల్ 12సంవత్సరాలుగా ఇంతపెద్ద బృహత్తర తాగునీటిపథకం ఉన్నా అందరికి రోజూ నిరివ్వని పరిస్థితి ఉండడం పట్ల రామనారాయణరెడ్డి అసహనం వ్యక్తంచేశారు. అధికారుల సమీక్షాసమావేశంలో మంత్రి సీరియస్ అయ్యారు. ఇంతపెద్ద పథకం మంజూరు చేయించానని, ఎందుకు అందరికీ ప్రతిరోజూ నిరివ్వడంలేదని, పట్టణంలోని 80శాతంమందికి రోజూ తాగునీటిని సరఫరాచేస్తున్న అధికారులు మిగతా 20శాతంమందికి కూడా రోజూ నీరిచ్చేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆనం ఆదేశించారు.



# బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తే జరిమానాలు విధించండి

## కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి, జరిమానాలను విధించాలని కమిషనర్ వైఓ నందన్ సిబ్బందిని ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక గాంధీ బొమ్మ, ట్రంకు రోడ్డు, సిరి థియేటర్ లైన్, రంగనాయకులపేట ఘాట్, కుక్కలగుంట వెహికల్ షెడ్, పరమేశ్వరి నగర్ వాకర్స్ రోడ్డు తదితర ప్రాంతాలలో కమిషనర్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇంటింటికి వచ్చే చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించాలని బహిరంగ ప్రదేశాలలో వేయరాదని సూచించారు. డ్రైను కాలువలలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు వేయడం వల్ల మురుగునీటి పారుదలకు ఆటంకిగా మారి, దోమల ఉత్పత్తికి కారణం అవుతుందని తెలిపారు. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయించడం చట్టరీత్యా నేరమని, నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలని కమిషనర్ సూచించారు. అన్ని డివిజన్లలో క్రమం తప్పకుండా డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులు జరిగేలా పారిశుధ్య విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ శానిటేషన్ విభాగం, రెవెన్యూ విభాగం, పట్టణ ప్రణాళిక విభాగం, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# హోమియోపతి వైద్యశాల సందర్శించిన సుధాకర్ రెడ్డి



## డాక్టర్ కరుణాకర్‌ని అభినందించిన టీడీపీ నాయకులు

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** కోవూరు తెలుగు దేశం మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, ఇనమడుగు ఎంపీటీసీ సునీల్‌రెడ్డి ప్రభుత్వ హోమియో వైద్యశాలని సందర్శించారు. వైద్యశాల పరిసరాలను, అక్కడ ఉన్న మందులను అన్నింటిని పరిశీలించారు. అక్కడె ఉన్న రోగులను అడిగి ఇక్కడ వైద్యసేవలు ఏలా ఉన్నాయి.. డాక్టరు ఏలా చూస్తున్నారు.. అని అడిగి తెలుసుకున్నారు. వారు చెప్పిన సమాదానాలు విని అన్ని మంచిగా ఉన్నాయి ఈ మందులతో బాగ తగ్గుతున్నాయి అని విని సంతోష పడి డా కరుణాకర్‌ని అభినందించారు. డాక్టరుని అన్ని అడిగి ఎప్పుడు విధుల్లో చేరారు.. ఏలా ఉంది ఇక్కడ అని తెలుసుకున్నారు. ఈ లానె మెరుగైన వైద్యసేవలు అందిస్తు ఇనమడుగు వైద్యశాలకు మంచి పేరు తీసుకుని రావాలని సూచించారు. ఏమైన సమస్యలు ఉంటె మా దృష్టికి తీసుకుని రావలని వాటిని పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. డాక్టర్ కరుణాకర్ అన్నిటికి సమాధానాలు ఇచ్చి మీ సహాయ సహకారులు ఉండాలని అభ్యర్థించరు ప్రస్తుతం ఏమి సమస్యలు లేవని ఓపి కూడా బాగ పెరిగిందని రోజు 30 మంది పైన వైద్యసేవలు పొందుతున్నారని ఇంకా పెంచి ఈ డిస్పెన్సరీకి మంచి పేరు తెస్తానని చెప్పారు. అలాగే యోగాంధ్ర గురించి అక్కడ జరుగుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. వారు సంతృప్తిగా ఫీలై అభినందిస్తు ఇలానే కొనసాగాలని సూచించారు. వారికి డా కరుణాకర్ ధన్యవాదాలు తెలిపారు.

సి.యడవల్లిలో..

# వికసిత్ కృషి సంకల్ప అభియాన్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లిలో సోమవారం మండల వ్యవసాయాధికారి కె.కిషోర్ ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయవరిపరిశోధనా సంస్థ ప్రిన్సిపుల్ సైంటిస్ట్ డాక్టర్ డి.వి.కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు. సదస్సులో డాక్టర్ నాగేశ్వరరావు ప్రసంగిస్తూ ఖరీఫ్ సీజన్‌కు ముందుగా రైతులకు అన్ని రకాల పరిజ్ఞానం అందించే దిశగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విచక్షణారహితంగా ఎరువులు వాడకుండా భూసారపరిక్షాఫలితాలకు అనుగుణంగా పంటలకు ఎరువులను వాడాలని ఆయన సూచించారు. నెల్లూరు వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలక్ష్మి ప్రసంగిస్తూ ప్రస్థుత సీజన్‌కు అనువైన వరి రకాలను, యాజమాన్య పద్ధతులను వివరించారు. కృషివిజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయకుమార్‌నాయక్ రైతులకు అందిస్తున్న కేంద్రప్రభుత్వ పథకాలు, వరిలో సస్యరక్షణ గురించి వివరించడంతోపాటు రైతుల సందేహాలకు సమాధానాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్త లక్ష్మిప్రసన్న, కృషివిజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి, డిఆర్‌సి వ్యవసాయాధికారిణి గీతాకుమారి, ఎంఏవో కె.కిషోర్, విఏఏలు షేక్ యస్థాని, వి.ప్రత్యుష, కరటంపాడు, చెర్లోయడవల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## నేటి నుంచి యోగా శిక్షణ తరగతులు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి ఈనెల 21వ తేదీ వరకు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అప్పాజీ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఈ శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతిఒక్కరు ఈ శిక్షణ తరగతులకు హాజరు కావాలన్నారు. యోగాతో అనేక ఉపయోగాలున్నాయని. ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# వాహనాలను నిబంధనలమేరకు నడపాలి

## ప్రమాదరహితం అందరి లక్ష్యంకావాలి : ఎంవీఐ





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** వాహనాలను తుచ తప్పకుండా నియమావళిమేరకు నడపాలని, ప్రమాద రహితప్రయాణం అందరి లక్ష్యం కావాలని ఆత్మకూరు మోటర్‌వెహికల్ ఇన్స్‌పెక్టర్ పి.రాములు పేర్కొన్నారు. సోమవారం జాతీయ భద్రతా మహెూత్సవాల్లో భాగంగా ఆయన జిల్లా డిటిసి ఆదేశాలమేరకు ఓ ప్రవేటు స్కూల్లో రాములు ఆధ్వర్యంలో అవగాహనాసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. వాహనాలను కండిషన్‌లో ఉంచాలని, కండిషన్‌లేని వాహనాలను నడపరాదన్నారు. అర్హులైన వారు మాత్రమే డ్రైవర్లుగా విధులు నిర్వహించాలని, రవాణా చట్టాలను సక్రమంగా పాటించాలని, ట్రాఫిక్‌నియమావళిని అనుసరించాలని, డ్రైవర్లు మద్యం సేవించి కానీ, సెల్‌ఫోన్లు మాట్లాడుతూకానీ వాహనాలను నడపరాదని, ప్రశాంతతతో వాహనాలను నడిపి సురక్షితంగా గమ్యం చేర్చాలని ఎంవిఐ సూచించారు. ఫిట్‌నెస్‌లేని వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాల వాహనాలను స్కమండిషన్‌లో ఉంచాలని, ప్రతి బస్సుకు ఒక సహాకుడిని ఏర్పాటు చేయాలని, ఆ సహాయకుడు అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులు ఆగినతరువాత జాగ్రత్తగా ఎక్కాలని, దిగాలని చెబుతూ తగిన అవగాహన కల్పించడంతోపాటు వారిని జాగ్రత్తగా ఇళ్ళకు చేర్చాలని రాములు సూచించారు. వాహనాలను నిర్లక్ష్యంగా నడిపి పసిపిల్లల ప్రాణాలతో చెలగాటమాడే డ్రైవర్లపై చర్యలు అత్యంత కఠినతరంగా ఉంటాయని రాములు హెచ్చరించారు. డ్రైవర్లు కార్లలో సీట్‌బెల్టులు వేసుకోవాలని, మోటర్‌బైక్‌లు నడిపేవారు హెల్మెట్లు ధరించాలని ఆయన సూచించారు. తగిన జాగ్రత్తలు లేకనే అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, అందరూ జాగ్రత్తలు పాటించి డ్రైవింగ్‌లో అప్రమత్తంగా ఉంటూ ప్రమాదరహిత ప్రయాణాలు సాగించాలని రాములు సూచించారు. తాము తరచూ తనిఖీలు నిర్వహిస్తామని, ఎలాంటి తప్పిదాలున్నా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. వాహనాలను వేగంగా నడపరాదని, అమితవేగం అత్యంత ప్రమాదకరమని ఆయన పేర్కొన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకోరాదని, 18 సంవత్సరాలలోపు వారికి డ్రైవింగ్‌చేసే అవకాశం ఇవ్వరాదని ఆయన సూచించారు. ప్రపంచవ్యాప్తంగా చూస్తే రోడ్డు ప్రమాదాలు మనదేశంలోనే అధికంగా జరుగుతున్నాయని రాములు తెలిపారు. డ్రైవర్లు మానసికప్రశాంతతో డ్రైవింగ్ చేయాలని, అన్ని జాగ్రత్తలు పాటించాలని, విధుల్లో నిరంతరం అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాలని ఎంవిఐ రాములు సూచించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, కార్యాలయ సిబ్బంది, స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్కూల్స్‌వాహనాల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రచందనం.. మైనింగ్ అక్రమాలపై యాక్షన్‌ప్లాన్

- 5 రేంజ్ల పరిధిల్లో బౌండరీలు, ట్రెంచ్‌ల ఏర్పాటు
- రాపూరు, ఆత్మకూరు రేంజ్ల పరిధిల్లో బౌండరీలు
- 40 రోజులపాటు పులి సంఖ్యాగణన సర్వే ప్రక్రియ
- జిల్లా అటవీ అధికారి కదిరి మహబూబ్ బాషా



**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** వెలుగొండ అటవీ రిజర్వు ప్రాంతాలకే తలమానికమైన ఎర్రచందనం.. మైనింగ్ అక్రమాల నియంత్రణపై ఉన్నతాధికారులు రూపొందించిన ప్రత్యేక యాక్షన్‌ప్లాన్‌ను అమలుచేసేందుకు రంగం సిద్ధమైనట్లు జిల్లా అటవీశాఖ అధికారి కదిరి మహబూబ్ బాషా తెలిపారు. సోమవారం ఆయన **మేజర్‌న్యూస్‌**తో మాట్లాడుతూ.. అటవీ టెరిటోరియల్ డివిజన్ ఆధీనంలో ఉన్న ఉదయగిరి, కావలి, నెల్లూరు, రాపూరు, ఆత్మకూరు రేంజ్ల పరిధుల్లో ఎర్రచందనం స్మగ్లర్ల తోపాటు మైనింగ్ మాఫియా, ఇతర చొరబాటుదారులు సాగిస్తున్న అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్టవేసే లక్ష్యంతో ఉన్నతాధికార యంత్రాంగం జారీ చేసిన ఆదేశాల మేరకు ట్రెంచ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇదే క్రమంలోరాపూరు, ఆత్మకూరు రేంజ్ పరిధిలో ఉన్న అటవీ రిజర్వు భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకునేందుకు అవసరమైన బౌండరీలు (కందకాలు) ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా నెల్లూరు రేంజ్ పరిధిలో 10.2 కిలోమీటర్ల పొడవుతోనూ, రాపూరు రేంజ్ పరిధిలో 22 బౌండరీ పిల్లర్స్, కాంపా నిధులతో మరో 12 ఎంపిట్స్, ఉదయగిరి రేంజ్ పరిధిలో 60 బౌండరీ పిల్లర్స్, మరో 3 కిలో మీటర్ల ట్రెంచ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తరుముకొస్తున్న వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో అమాయక అడవిజంతువుల దాహార్తిని తీర్చేందుకు నెల్లూరు, రాపూరు, ఆత్మకూరు, కావలి, ఉదయగిరి రేంజ్ల పరిధిలోని వన్యప్రాణి సంచారిత ప్రాంతాల్లో సాసర్పిట్స్ (నీటితొట్టెలు) ఏర్పాటు చెయడంతోపాటు ప్రతి రోజు క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఎర్రచందనం, మైనింగ్ ఆధారిత ప్రాంతాలైన రాపూరు, నెల్లూరు రేంజ్ల పరిధిలో క్షేత్రస్థాయిలో నిఘాలు ముమ్మరం చేయడంతోపాటు గాలింపులు, కూంబింగ్లు చేపట్టడం జరిగిందన్నారు. ఇదేక్రమంలో ప్రభుత్వ ఆదేశానుసారం రెవెన్యూశాఖ చేపడుతున్న సమగ్ర భూసర్వే ప్రక్రియలో అటవీశాఖ భాగస్వామ్యం కావడం జరిగిందని, ఆయా రేంజ్ల పరిధిలో ఎక్కడైనా అటవీ రిజర్వు భూములు ఆక్రమణకు గురైనట్లు గుర్తించిన వెంటనే సదరు భూములను స్వాధీనం చేసుకోవడం జరుగుతుందన్నారు. ప్రకృతి ప్రసాదించిన ఎర్రచందనం, మైనింగ్ జోలికొస్తే ఉపేక్షించబోమని, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎర్రచందనం స్మగ్లర్ల ఎత్తుగడలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ లక్షలాది రూపాయల విలువచేసే దుంగలు, వాహనాలు, నిందితులను అదుపులోకి తీసుకోవడంలో విశేష కృషి చేస్తున్న రేంజ్, డిప్యూటీ రేంజ్ స్థాయి అధికారులతోపాటు సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు సైక్లింగ్ ఫోర్స్, ఫైర్, ప్రొటెక్షన్ వాచర్లకు పేరుపేరునా అభినందనలు తెలిపారు. ఇదే తరహా ఉత్సాహంతో అరుదైన ఎర్రచందనాన్ని అక్రమార్కుల బారి నుంచి కాపాడుకోవడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**డ్యూయల్ మేజర్, ఏబీసీ విధానాలతో..**

# విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన బాట

**వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు**



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహాపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ, భాగమైన డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎడ్యుకేషన్, లా కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్షా సమావేశం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమానికి వీఎస్‌యూ వైస్ చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన విద్యావిధానం (ఎన్ఈపీ-2020) కింద సింగిల్ మెజర్ ప్రోగ్రాములను డ్యూయల్ మేజర్‌గా మార్చడం వల్ల విద్యార్థులు రెండు విభిన్న రంగాల్లో నైపుణ్యాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇది వారి భవిష్యత్తు కెరీర్‌కు దోహదపడుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ) ద్వారా విద్యార్థులు దేశంలోని ఏ విద్యాసంస్థలో చదివినా పొందిన క్రెడిట్లను డిజిటల్ ప్లాట్‌ఫారమ్ ద్వారా నిల్వ చేసుకోవచ్చని వివరించారు. ఇది విద్యలో కొనసాగుదలకి, విద్యార్థుల నైపుణ్యాల పెంపుకి ఉపయోగపడుతుందని అన్నారు. 'యోగాంధ్ర 2025' కార్యక్రమం కింద విద్యార్థుల వివరాలను సమగ్రంగా డిజిటల్ ఫార్మాట్‌లో నమోదు చేయాలని సూచించిన వైస్ ఛాన్సలర్, అనుబంధ కళాశాలలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మాట్లాడిన రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ.. 'విశ్వవిద్యాలయం ప్రవేశపెడుతున్న విద్యా విధానాల్లో అనుబంధ కళాశాలల పాత్ర ఎంతో కీలకం. ప్రతి కళాశాల డ్యూయల్ మెజర్, ఏబీసీ వంటి మార్పుల అమలులో చురుకుగా ఉండాలి' అని పేర్కొన్నారు. డీన్ కాలేజియేట్ డెవలప్మెంట్ కౌన్సిల్ డాక్టర్ ఎం.హుస్సేనయ్య మాట్లాడుతూ.. 'నూతన విద్యా విధానానికి అనుగుణంగా ప్రస్తుత మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలి. అకడమిక్ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలి' అని అన్నారు. పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఆర్.మధుమతి మాట్లాడుతూ.. 'పరీక్షల నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి. డిజిటల్ పద్ధతులు పరీక్షల పారదర్శకతను పెంచుతాయి' అని తెలిపారు. ఈ సమావేశంలో వీఎస్‌యూ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఉదయ శంకర్ అల్లం, డైరెక్టర్ డాక్టర్ ఎం.హనుమారెడ్డి, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు టౌన్ విద్యుత్ ఆపరేషన్ డివిజన్ అధీనంలో ఉన్న 33/11కేవీ తెలుగు గంగ సబ్ స్టేషన్పరిధిలోని 11కేవీ సంజయ్ గాంధీ నగర్ ఫీడర్ కింద రోడ్ వెడల్పు పనులు జరుగుతున్నందున సంజయ్ గాంధీ నగర్.. ఇందిరా గాంధీ నగర్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మన్నేపల్లి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్పును సహృదయులైన వినియోగదారులు గమనించాలని.. అత్యవసర విభాగం వారు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

## వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** సమాజంలో ప్రతిఒక్కరు కీటక జనిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్యులు ప్రశాంత్, సి.రాహుల్, సింధూరలు సూచించారు. సోమవారం మలేరియా మాసోత్సవాల్లో భాగంగా వైద్యశాలకు వచ్చిన రోగులకు అవగాహన కల్పించి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు దోమలు కుట్టకుండా, చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వైద్యఆరోగ్య సిబ్బంది సలహాలు పాటిస్తూ వ్యాదులకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్ బాబు, టీబీ సూపర్వైజర్ బోగ్యం వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు టీటీడీ చైర్మన్‌కు ఆహ్వానం



**దుత్తలూరు/వింజమూరు, మేజర్‌న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బి.ఆర్ నాయుడుని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, శ్రీ వెంగమాంబ ఆలయ ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్లు నాయుడు, ఈనెల 15 నుండి జరుగు శ్రీ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆహ్వానం మేరకు ఈనెల 18వ తేదీన అమ్మవారిని దర్శించుకుంటానని ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారన్నారు. అదేవిధంగా శ్రీ వెంగమాంబ ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. అమ్మవారి ఆలయానికి అన్ని విధాల సహకరిస్తానని బీఆర్ నాయుడు తెలిపారు. హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్లంపాటి గురవయ్య నాయుడు, బాబురావు తదితరులు ఉన్నారు.

## వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4వ తేదీన తలపెట్టిన 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమం యొక్క పోస్టర్‌ను నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి నివాసం నందు నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు జంకె వెంకట రెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం : ఎస్పీ జి.కృష్ణకాంత్

**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిఆర్‌జిఎస్) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 104 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ప్రజా సమస్య పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులు లపై త్వరితగతిన స్పందించి చట్ట ప్రకారం విచారణ జరిపి పరిష్కరించాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సిహెచ్ సౌజన్య, కావాలి డిఎస్పి శ్రీధర్, ఎస్బి-1 సీఐ వెంకటేశ్వరరావు, ఎస్బి-2 సీఐ శ్రీనివాసుల్ రెడ్డి, వెల్ఫేర్ ఆర్ ఐ రాజారావు, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

- వేదాయపాలెం పరిధికి చెందినటువంటి మహిళ యొక్క కుమారునికి, పోలీస్ కాలనీకి చెందిన పి.శివయ్య అనే వ్యక్తి ప్రభుత్వ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి 15 లక్షలు నగదు తీసుకొని రెండు ప్రాంతాలలో ఉద్యోగం వచ్చిందని నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్ కాపీలు ఇచ్చి మోసం చేశాడని, నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు.
- దర్గామిట్ట పరిధికి చెందిన వ్యక్తి జొన్నవాడలోని ఓ దేవస్థానంలో పూజారిగా ఉన్నట్లు, ప్రకాశం జిల్లా కనిగిరికి చెందినటువంటి మహిళ పూజ కోసం తన నంబర్ అడిగినట్లు, తరచూ ఫోన్లు చేస్తూ తను చెప్పినట్లు వినాలని లేదంటే తన పరువు తీస్తానని చెప్పి, సోషల్ మీడియా ద్వారా వారి కుటుంబ సభ్యులకు బంధువులకు పరువు తీసేవిధంగా అసత్య మెసేజ్లు పెట్టి వేధిస్తున్నట్లు, తను చెప్పినట్లు వినకపోతే చంపుతానని బెదిరిస్తున్నట్లు, విచారించి న్యాయం చేయాలని అతను కోరారు.
- నవాబ్ పేట పరిధికి చెందినటువంటి మహిళను నెల్లూరు కు చెందిన ఎస్.కె.జానీ తన ఇంటి మీద 50 నుండి 60 లక్షలు వరకు లోన్ ఇప్పిస్తానని నమ్మించి తన వద్ద మూడు లక్షలు నగదు తీసుకున్నాడని, రెండు నెలల్లో లోన్ ఇప్పిస్తానని ఇప్పటికే ఆరు నెలలైనా ఎటువంటి లోను ఇప్పించలేదని, అడిగితే బెదిరిస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు.
- వివి పాలెం పరిధికి చెందినటువంటి మహిళ తన కుటుంబ సభ్యులతో కలిసి ఒక చిన్న హెూటల్ నడుపుతున్నట్లు అదే ప్రాంతానికి చెందినటువంటి మనోజ్ అతని అనుచరులు 6 మంది కలిసి అల్లరి చేస్తూ గొడవలు చేయగా కేసు నమోదు చేసినట్లు, అయినా కూడా మళ్ళీ వచ్చి బెదిరించి వేధిస్తున్నట్లు విచారించి న్యాయం చేయాలని కోరారు.
- బాలాజీ నగర్ పరిధికి చెందినటువంటి ఓ వ్యక్తి యొక్క కుమారుడు లండన్ లో చదువుతున్నట్లు, తన కుమారునికి 1,02,000/- నగదు పంపించాలని చిల్డ్రన్ పార్క్ వద్ద ఉన్న ఓ కంపెనీకి చెందిన అవినాష్ రెడ్డి అనే వ్యక్తిని సంప్రదించగా అతను పంపుతానని నగదు తీసుకొని తన అవసరాలకు ఉపయోగించుకుని తన కుమారుడికి నగదు పంపించలేదని, అడిగితే నగదు తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు.
- కోవూరు పరిధికి చెందిన యువతిని అదే ప్రాంతానికి చెందిన రషీద్ అనే వ్యక్తి



ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మాయ మాటలు చెప్పి ప్రస్తుతం అడిగితే ఫోన్లో ఉన్న వీడియోలు చూపించి బెదిరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అదేవిధంగా సంగం పరిధికి చెందిన యువతని అదే ప్రాంతానికి చెందిన అనిల్ అనే వ్యక్తి వెంటపడి వేధిస్తూ ఇంటికి వచ్చి బెదిరిస్తున్నాడని పలుమార్లు కౌన్సిలింగ్ నిర్వహించిన తన ప్రవర్తన మారలేదని, చెడు ఉద్దేశంతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని తన వల్ల ప్రాణహాని ఉందని రక్షించాలని కోరారు.
- బాలాజీ నగర్ పరిధికి చెందినటువంటి మహిళ తన భర్త తరచూ తగాదాలతో వేధిస్తున్నాడని అంతేకాకుండా అత్తమామలు కూడా ఇబ్బందులు గురి చేస్తున్నారని అదేవిధంగా వింజమూరు పరిధికి చెందినటువంటి మహిళను తన భర్త అదనపు కట్నం కోసం బంగారం డబ్బు తీసుకురావాలని వేధిస్తున్నాడని కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలని కోరారు.
- అల్లూరు పరిధికి చెందినటువంటి వృద్ధురాలుని తన చిన్న కుమారుడు చెడు వ్యసనాలకు బానిసై కొట్టి వేధిస్తున్నాడని ఆస్తి కోసం ఇబ్బందులు గురి చేస్తున్నాడని అతను నుండి ప్రాణహాని ఉందని విచారించి న్యాయం చేయాలని కోరారు.

## ఐఐటి జేఈఈ-అడ్వాన్స్ ఫలితాలలో నారాయణ విజయకేతనం

**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** పోటీ పరీక్షలు ఏదైనా నారాయణదె అగ్రస్థానం అని మరోసారి నిరూపితమైనది. జేఈఈ అడ్వాన్స్ 2025 ప్రకటించిన ఫలితాలలో నారాయణ ఐఐటి అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో ఓపెన్ క్యాటగిరీలో 3, 4, 5, 6, 7, 10 ర్యాంకులు 1 నుండి 10 లోపు ఐదు ర్యాంకులు కైవసం చేసుకోవడం జరిగింది. నెల్లూరు నారాయణ ఐఐటి అకాడమీ విద్యార్థులు ఓపెన్ క్యాటగిరిలలో ఎం.మధు కిరణ్ 133వ ర్యాంకు(ఈడబ్ల్యూఎస్-11 ర్యాంక్), కే.పూర్వజ్ 332వ ర్యాంక్, జి.సంతోష్ 1361వ ర్యాంక్,(ఈడబ్ల్యూఎస్ 109వ ర్యాంక్) బి.భానురిషిక్ 1563వ ర్యాంక్ (ఓబిసి 261 ర్యాంక్) ఎం అఖిలేష్ 2323 ర్యాంక్ (ఓబిసి 412వ ర్యాంక్) ఎం.యశ్వంత్ బాబి 2481 ర్యాంక్ (ఎస్సీ 36వ ర్యాంక్) జి.సాయి సత్విక్ 2517 ర్యాంక్ (ఓబిసి 455వ ర్యాంక్) కె.ఆశ్రిత 2758 ర్యాంక్, కె.హర్షవర్ధన్ రెడ్డి 2760వ ర్యాంక్, చుండి శశి జ్ఞాన కౌశిక్ రెడ్డి 3129వ ర్యాంక్ (ఈడబ్ల్యూఎస్ 293 ర్యాంక్) జి హితేష్ అభిషేక్ 3292వ బ్యాంక్, కె భాను సుజిత్ 3446వ ర్యాంక్ (ఓబిసి 642వ ర్యాంక్) జె మేఘన3756వ ర్యాంక్, ఎం హేమంత్ సాయి 4722వ ర్యాంక్ లు సాధించారు. ఓపెన్ క్యాటగిరిలో 150 ర్యాంకులలోపు 1,2000 ర్యాంకుల్లోపు 4 మంది, 3000 ర్యాంకులోపు 9 మంది,5000 ర్యాంకులు లోపు 14 మంది, 10000 ర్యాంకులలోపు 25మంది, 20000 ర్యాంకుల్లోపు 56 మంది, 30000 ర్యాంకుల్లోపు 68 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారు. అన్ని కేటగిరిలో 5000 ర్యాంకుల లోపు 97



మంది, 10000 ర్యాంకుల్లోపు122 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారు. జేఈఈ అడ్వాన్స్‌లో 130 మంది అర్హత సాధించారని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు తల్లిదండ్రులకు అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందానికి నారాయణ యాజమాన్యం అభినందనలు తెలియజేసింది. నారాయణ విద్యాసంస్థల పటిష్టమైన మైక్రో షెడ్యూల్, బోధన పద్ధతులు, పరీక్ష విధానాల వల్ల ఇంతటి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కోర్-డీన్, డీన్ లు, డీజీఎంలు, ఏజీఎంలు, ప్రిన్సిపల్స్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 4న నెల్లూరు, 5న వింజమూరులో పెన్షన్, జీపీఎఫ్ అదాలత్

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జూన్ 4 వ తేదీ బుధవారం నెల్లూరు జిల్లాలో పెండింగ్లో ఉన్న పెన్షన్, జీపీఎఫ్ కేసులను సమీక్షించడానికి అకౌంటెంట్ జనరల్ ఆధ్వర్యంలో అదాలత్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతిప్రియ సోమవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఉదయం 10గంటలకు జిల్లా పరిధి లోని పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ జరుగుతుందని, అదేవిధంగా జూన్ 5వ తేదీన వింజమూరు ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధికారులు, డీడీఓలు వారి కార్యాలయాల్లో, శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పెన్షన్ కేసులు, పెన్షన్ అనుబంధ సమస్యల వివరాలతో హాజరుకావాలని సూచించారు. పెండింగ్లో ఉన్న పెన్షన్స్ మరియు జిపిఎఫ్ కేసులను సమీక్షించి అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల



పెన్షన్ ప్రతిపాదనలు పదవీ విరమణ తేదీకి ముందే సంబంధిత జిల్లా డ్రాయింగ్ అండ్ పంపిణీ అధికారులు వారి పెన్షన్ పత్రాలను సమర్పించే విధంగా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం ద్వారా రాష్ట్రంలో ఇప్పటివరకు విశాఖపట్నం, చిత్తూరు, కర్నూలు, కడప, పాడేరు, తిరుపతి, ఏ.పి. సెక్రటేరియట్ వెలగపూడి, ఏపీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మంగళగిరి, రాజమండ్రి లలో పెన్షన్ జిపిఎఫ్ అదాలత్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు శాంతిప్రియ తెలిపారు. పెన్షన్ జిపిఎఫ్ అదాలత్ కార్యక్రమంలో అకౌంటెంట్ జనరల్ కార్యాలయం నుంచి అధికారులు, సిబ్బంది హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని పెన్షనర్లు, జిల్లా అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ అధికారి గంగాద్రి నోడల్ అధికారిగా హాజరవుతారని ఆమె తెలిపారు.

## బీసీలపై వేధింపులే కాకాణికి శాపాలయ్యాయి




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** మంత్రిగా ఏ రోజూ గోవర్ధన్ రెడ్డిని కోవూరుకు ఆహ్వానించని ప్రసన్నకు అమాంతంగా ఆయనపై ప్రేమ పుట్టుకొచ్చినట్టుంది. సొంత మేనత్తను అవమానించేలా కాకాణి మాట్లాడిన రోజు ప్రసన్న ఏం చేస్తున్నాడో.. నెల్లూరు వేదాయపాళెంలోని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో మీడియాతో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మా నాయకుడు సోమిరెడ్డిపై ప్రసన్నకుమార్ రెడ్డి విమర్శలు శోచనీయమని, సోమిరెడ్డి ఎన్నికల్లో ఓడినా ఏ రోజూ ఇంటికి పరిమితం కాలేదు..గెలిచినా ఓడినా ప్రజల కోసమే పనిచేశారు. వైసీపీ ఆరాచక పాలనపై వీరోచిత పోరాటం చేసిన నాయకుడు సోమిరెడ్డి అని, గతంలో సోమిరెడ్డి కుటుంబంపై కాకాణి దారుణమైన వ్యాఖ్యలు చేశాడు..తన మేనత్త(సోమిరెడ్డి తల్లి)ను కూడా కించపరిచేలా మాట్లాడిన రోజు ప్రసన్నకుమార్ రెడ్డి ఏం చేస్తున్నాడో.. అక్రమాలకు పాల్పడబట్టే ఈ రోజే కాకాణి జైలుకు ఉన్నాడు.. కోర్టులను ఎవరూ ప్రభావితం చేయలేరు.. నేరస్తుల విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. వైసీపీ పాలనలో కాకాణి గోవర్ధన్ రెడ్డి బీసీలపై కక్షకట్టి వేధింపులకు పాల్పడ్డాడు. కోడూరులో గంగాధర్ రొయ్యల గుంతలను ధ్వంసం చేయించి రూ.1.50 కోట్ల విలువైన రొయ్యలను సముద్రం పాల్జేశాడు. వెంకటాచలం మండలంలో కుంకాల నాగేంద్రకు చెందిన సెల్ టవర్లను కూలగొట్టించాడు.. లారీ కాటాను ధ్వంసం చేయించాడు. ఎందరో బీసీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపాడు.. ఇవన్నీ చేసిన రోజు ప్రసన్నకుమార్ రెడ్డి తప్పని వారించకూడదా.. బీసీలపై సాధించిన వేధింపులే ఈ రోజు కాకాణికి శాపంగా చుట్టుముట్టాయి. కాకాణి గోవర్ధన్ రెడ్డిపై ఈ రోజు ప్రసన్న ఎక్కడలేని ప్రేమ ఒలకబోస్తున్నాడు.. కానీ ఆయన మంత్రిగా ఉన్నప్పుడు ఒక్క రోజైనా కోవూరుకు ఆహ్వానించాడా.. ఇప్పటికైనా సోమిరెడ్డి కుటుంబంపై పడి ఏడ్వడం ఆపాలని హితవు పలుకుతున్నామన్నారు.